# వింత ఆస్పత్రి

దారినపొయ్యేవాణ్ణి కాస్తా ఆ బల్లచూసి నిర్ఘాంతపడి నిలిచిపోయాను. ఆ బల్లమీద ఈ విధంగా రాసివుంది :

"డాక్టర్ ధన్వంతరిగారి అద్భుత చికిత్సలు."

దానికింద చిన్న అక్షరాలతో, "ధనమదాంధతకు, పదవీ వ్యామోహానికి, అధికారోన్మత్తతకు, ఆత్మపరాయణతకు, కృతఘ్నతకు, అజ్ఞానాంధకారానికి మూఢ విశ్వాసాలకు, ఇతర రాజకీయ, సాంఘిక వ్యాధులకు తిరుగులేని చికిత్స చేయబడును" అని వున్నది.

మళ్ళీ దానికింద పెద్ద అక్షరాలతో, "యుద్ధ జ్వరానికి యుద్ధోన్మాదానికి ఉచిత చికిత్స" అని రాసివుంది.

అట్టడుగున మళ్ళీ చిన్న అక్షరాలతో, "కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలకు మా పోర్టబుల్ చెస్ట్ వాడుడు," అని వుంది.

ఆ దారిన నేను చాలాసార్లు వెళ్ళాను గాని ఈ బల్ల ఎన్నడూ చూడలేదు. నిన్ననో మొన్ననో అది వెలిసి ఉండాలి.

ఆ బల్లమీద విషయాలు రెండోసారి చదువుతూ, "ఇది ఎవరో వేళాకోళానికి రాసి వుంటారు," అనుకున్నాను.

అది పెద్ద జనసంచారం గల వీధి కాదు. అందులోనూ ఉదయం ఏడు గంటలే అయింది. లోపలికివెళ్ళి డాక్టర్ ధన్వంతరిగారిని చూసి మాట్లాడాలనీ, ఆయన అభిప్రాయమేమిటో తెలుసుకోవాలనీ అనిపించింది. నేను విలేఖరిని. నేను పోరాని చోటంటూ లేదు. కాని ఇంత పెందలాడే వెళితే డాక్టరుగారు నిద్రలేచి వుంటారో ఉండరో అని సందేహం కలిగింది.

అయినా సాహసించి తలుపు తట్టాను. తలుపు దానికదే తెరుచుకుంది. లోపలికి అడుగుపెట్టాను. ఎవరూ కనిపించలేదు.

"డాక్టర్," అని కేకపెట్టాను.

"లోపలికి రండి," అని పక్కగది నుంచి గింగురుమని ధ్వనించే బొంగురు గొంతు వినవచ్చింది.

ఆ గది తలుపు తెరుచుకుని లోపలికి వెళ్ళాను, పుస్తకాలు చిందర వందరగా వున్న బల్లవెనక నుంచి ఒక వృద్ధుడు తల ఎత్తి నాకేసి చూసి నవ్వాడు. ఆయన జుట్టూ, గడ్డమూ సగానికి పైగా నెరిసి వుంది. ఆయన ముఖం చూడగానే నాకు టాల్‌స్టాయ్ ఫోటో, కారల్‌మార్క్స్ ఫోటో, రవీంద్రనాథ్ టాగూర్ ఫోటో దాదాపు ఒక్కసారి జ్ఞాపకం వచ్చాయి. ఈ వ్యక్తుల ముఖాలలో పరస్పరం పోలికలు లేకపోయినా నేను చూసిన వృద్ధుడి ముఖంలో ముగ్గురి ఛాయలూ ఉన్నట్లు నాకు తోచింది.

"తమరేనా డాక్టర్ ధన్వంతరిగారు?" అన్నాను.

"అవును. రండి, కూర్చోండి. మీకు నావల్ల ఏం సహాయం కావాలి?" అన్నాడు డాక్టర్‌గారు.

"బయట బోర్డు చూశాను—" అని ప్రారంభించాను.

ఆగమన్నట్టు వేలెత్తి సంజ్ఞచేసి డాక్టరుగారు తన ఎదటవున్న పుస్తకంలో గుర్తొకటి పెట్టి మూసేసి పుస్తకాన్ని పక్కకుపెట్టి రెండు చేతులూ బల్లమీద పెట్టి, నాకేసి చూస్తూ, "ఆ బోర్డుమీద చాలా కొద్ది వ్యాధులే రాశాను. కాని నా పరిశోధనల ప్రకారం మానవజాతి పదిహేనువేల ఏడువందల తొంభై యెనిమిది మానసిక వ్యాధులతో బాధపడుతోంది. అందులో కొన్ని వ్యాధులను గుర్తించటానికి చాలా నైపుణ్యం కావాలి. నేను అరవైయేళ్ళకు పైగా పరిశోధనలు

చేశాను. పన్నెండువేల గ్రంథాలు శ్రద్ధగా పరిశీలించాను. పరిపూర్ణమైన శరీరారోగ్యం సాధ్యమనే నమ్మకంపై దేహ చికిత్స ఆధారపడి వుంది. పరిపూర్ణమైన మానసిక ఆరోగ్యం సాధ్యమనే సిద్ధాంతంపైనా చికిత్సలు ఆధారపడ్డాయి" అన్నాడు.

"మానసిక వ్యాధులను కలిగించే భౌతిక పరిస్థితులను గురించి మీరు పట్టించుకోరా?"

"పట్టించుకుంటాను. రోగులకు సలహాలిస్తాను. కాని వాళ్ళు వినరు. భౌతిక పరిస్థితులు మార్చుకోక అవే రోగాలతో మళ్ళీ మళ్ళీ నా దగ్గిరికి వస్తూంటారు."

"మీ దగ్గిరకు చాలా మంది వస్తూంటారా?" అని అడిగాను.

"ఫరవాలేదు. వచ్చిన ప్రతి రోగిపట్లా నాకు చాలా శ్రద్ధ గనక నేను నా రోగులను వేల సంఖ్యలో గణించను. రెండు మూడు రోజులకు ఒక రోగి వచ్చినా నేను చాలా సంతోషిస్తాను."

"మీరిక్కడ ఎంత కాలమై ప్రాక్టీసు చేస్తున్నారు?"

"నిన్ననే వచ్చాను."

"అంతకు పూర్వం?"

"నాయనా, ప్రపంచం విశాలమైనది."

"క్షమించండి. నేను చికిత్స కోసం రాలేదు. పత్రికా విలేఖరికి సహజమైన వార్తా తృష్ణతో వచ్చాను."

"దానికేం?" అన్నాడు డాక్టరుగారు.

"క్షమించండి. మీ చికిత్సవల్ల ప్రపంచానికి లాభం కలుగుతుందని మీకు నమ్మకం వుందా?"

"నమ్మకం వుండటం కాదు. ప్రపంచానికి లాభం వుందని నేనెరుగుదును. కొద్దికాలం క్రితం నా దగ్గిరకొక చిత్రమైన కేసు వచ్చింది," డాక్టరుగారు మీసాలలో నుంచి చిరునవ్వు నవ్వి, గడ్డం వేళ్ళతో దువ్వి, నాకేసి కొంటెగా చూసి చెప్పుకుపోయారు.

"ఆయన ఒక ప్రధానమంత్రి. గొప్ప రాజకీయవేత్తగా ప్రసిద్ధికెక్కాడు. మరేం కారణం లేదు. ఆయన ఏరోజు ఒక ప్రకటన చేసినా మర్నాడు లక్షలాది జనులకు వెర్రెత్తి పోయేది, మీటింగులు చేసేవారు. నిరసన తెలిపేవారు. పోలీసులు వచ్చి తుపాకులతో మీటింగులు చెదరగొట్టేవారు. రక్తం ఏరులై పారేది. వాక్కులో అంత ప్రతిభగల రాజకీయవేత్తలను పదిమందిని కూడా మానవజాతి చూసి వుండదనవచ్చు. అటువంటి వ్యక్తి నా దగ్గిరకి వచ్చాడు.

నేను చికిత్స చేశాను. తిరిగి ఆయన రాజకీయాలలోకి పోయేసరికి ఆయనను ఎవరూ దగ్గిరకి రానివ్వలేదు. అదే ఆయన రాజకీయ మరణం అనుకోవచ్చు."

నేను కాస్సేపు ఆలోచించి, "ప్రస్తుతం ప్రపంచం చాలా 'ఇజం'ల మధ్య నలుగుతోంది. ఇందులో మీరు దేనిని బలపరుస్తారు?" అన్నాను.

డాక్టరు కళ్ళు పెద్దవిచేసి, పిడికిలి పైకెత్తి, గంటరస్వరంతో, "శక్తి! శక్తి! 'ఇజము'లకు దాఖలా ఏమిటి? నేను నాలుగు వందల పౌనుల బరువుగల మనిషిని చూశాను. చావటానికి సిద్ధంగా వున్నట్టున్న మనుషులనూ చూస్తున్నాను. ఏ ఇజమునుబట్టి ఆ మనిషి అంత శక్తివంతుడైనాడు, ఏ ఇజమునుబట్టి వీళ్ళు జీవచ్ఛవాలుగా వున్నారు? మనిషికిలాగే," మళ్ళీ డాక్టరుగారి వేలు పైకి లేచింది. "సంఘం కూడా బలంగా, ధైర్యంగా, అభివృద్ధి చెందుతూ, ఆత్మవిశ్వాసం పెంచుకుంటూ పెరగాలి. ఒక చిన్న పిల్లవాడి పెంపుచూసి ఎంతో ఆనందిస్తాం. వాడి భావాలూ, శక్తులూ వికసిస్తుంటే ఆశ్చర్యపడతాం. పిల్లవాడు కొంతవరకే పెరుగుతాడు. వడిలిపోతాడు. చచ్చిపోతాడు. సంఘం చావదు. పెరగటం మానదు. దాన్ని గురించి మానవులు ఎంత ఆసక్తి కనబరచాలి? ఏదీ?"

"పోనివ్వండి. ఏ ఇజమూ అక్కర్లేకుండా సంఘం పెరుగుతుందా?"

"ఎందుకు పెరగదు. ఎట్లా పెరగాలో సంఘానికి తెలుసు."

"అయితే మరి పెరగదేం? చరిత్ర చూస్తే సంఘం పతనమైన దాఖలాలు ఎన్నో కనిపిస్తాయేం?"

"ఏమా? పిరికిపందలు సంఘాన్ని శాసించటంవల్ల! వ్యాధిగ్రస్తులు సంఘం యొక్క పెంపును అరికట్టడంవల్ల. చూడు! సంఘం యొక్క చీడ పురుగులకు యెంత రక్షణో! చూడు సంఘంయొక్క ఆయువుపట్లకు తుపాకులూ పిరంగులూ యెట్లా బారుచేసి వున్నాయో! సంఘం యెట్లా పెరుగుతుంది? చూడు సంఘం యొక్క పెరుగుదలను నిషేధిస్తూ ఎన్ని వ్యాధిజనిత శాసనాలో? మనుషుల వేటలూ, మారణాయుధాల తయారీ, అసత్యాలూ, అనాగరికతా చూడు! మానవ సమాజం ఎందరు మహాపురుషులను చూసింది? వాళ్ళతో ఈనాటి ప్రపంచ నాయకులను పోల్చు!"

మా సంభాషణకు అంతరాయం కలిగింది. ఇద్దరు వ్యక్తులు అనుమానిస్తూ లోపలికి వచ్చారు.

"దయచేయండి," అన్నాడు డాక్టరుగారు.

## 2

ఆ వచ్చిన వారిలో ఒకరు స్త్రీ, మరొకరు పురుషుడు. ఇద్దరూ మధ్య వయస్కులు. భార్యా భర్తల్లాగా ఉన్నారు.

"కూర్చోండి," అన్నారు ధన్వంతరిగారు.

"నన్ను అనవసరంగా తెచ్చావు. నాకేమీ జబ్బు లేదు," అన్నాడు పురుషుడు. స్త్రీ డాక్టరుకేసి జాలిగా చూసింది. డాక్టరు మీసాల మధ్యగా చిరునవ్వు కనిపించింది.

"దానికేమీ సందేహం లేదు, మీకేమీ జబ్బు లేనట్టే నాకూ తోస్తోంది. అయినా ఆ కుర్చీలో కూర్చోండి. ఒక్క క్షణంలో తేలిపోతుంది."

పురుషుడు తాను మొదట కూర్చున్న కుర్చీలోనుంచి లేచి డాక్టరు చెప్పిన ప్రకారం దూరంగా ఉన్న ఇంకో కుర్చీలో కూర్చున్నాడు. డాక్టరుగారు ఏదో మీట నొక్కారు. పురుషుడి ముఖాన లేత గులాబీ, లేత ఆకుపచ్చ, లేత నీలం రంగులు ఆడసాగాయి; ఆయన కాస్సేపు తన్మయత్వంతో వాటిని చూసి ఆనందించి క్రమంగా కళ్లు మూశాడు.

డాక్టరు లేచి ఆయన పక్కకు వెళ్ళి, "మీ బాధ ఏమిటి?" అని అడిగాడు. రోగి కళ్లు మూసుకునే సమాధానం చెప్పాడు!

"నా దృష్టి పూర్తిగా పాడయిపోయింది."

"ఎట్లా తెలుసు?"

"దగ్గిరవాళ్ళను కూడా గుర్తించలేను."

"సమీపంలో వాళ్ళనా, సన్నిహితులనా?"

"సన్నిహితులను .. నాకు చత్వారం వచ్చిపోయింది. ఒక్కొక్కసారి నా భార్యా బిడ్డలు కూడా నా చూపుకు ఆనరు?"

"ఈ వ్యాధి ఎప్పటినుంచి?"

"వ్యాపారంలో లాభాలు రాసాగినప్పటినుంచి."

"డబ్బు మీ కంటికి అది కనిపిస్తుందా?"

"కనిపిస్తుంది....మొన్న మా బావమరిది నా కోసం వస్తే, ఎవరో చందా కోసం వచ్చారనుకుని, 'తరవాత కనపడవయ్యా,' అనేశాను. తీరా చూస్తే మా చెల్లెలి భర్త."

"దీనికేదైనా చికిత్స చెయ్యండి. బాబూ," అన్నది స్త్రీ.

డాక్టరుగారు సమాధానం చెప్పేలోపుగా ఒక పొట్టివాడు, బక్కపలచటి వాడు ఆదరాబాదరా లోపలికి వచ్చాడు.

## 3

మీరేనా ధన్వంతరిగారు?" అన్నాడా పొట్టివాడు, కొట్టవచ్చేవాడిలాగా.

"అవును!" అన్నాడు డాక్టరు.

"చాతనయితే నా వ్యాధి నయం చెయ్యండి."

"ఏమిటి నీ వ్యాధి?"

"నేను కవిని, మహాకవిని, కవికిశోరాన్ని, కవిశార్దూలాన్ని."

"అందులో వ్యాధి ఏమీ లేదే."

"వినండి. కవిగా నేను చిన్నతనంలో చాలా ఎత్తు పెరిగిపోయాను. ఎంత ఎత్తు పెరిగానో మీ రూహించలేరు."

"కొంచెం మాకు విప్పి చెబితే."

"నేను మనుషులకేసి చూస్తే నెత్తిమీద వెంట్రుకలు తప్ప నా కేమీ వుండవు. వాళ్లు చిన్న గొంతులతో మాట్లాడితే ఆ శబ్దం నా చెవులదాకా రాదు. వ్యాధికోసం మొకరిల్లినా లాభం లేకపోయింది. ఇక వారి యెదుట సాష్టాంగ పడనా? ఛీ! అది నావల్ల కాదు."

డాక్టరుగారు బిగ్గిరిగా నవ్వాడు. "నీకే వ్యాధి లేదు. నువు భ్రమలో ఉన్నావంతే!" అన్నా డాయన.

"భ్రమా? ఏం భ్రమ?" అన్నాడు పొట్టివాడు సంకోచిస్తూ.

"ప్రజలు నీకేసి చూడటం లేదు. చూస్తే నువ్వెంత ఎత్తున్నా వాళ్ళ ముఖాలు నీకు కనిపించేవే. పిచ్చివాడా, సూర్యుడికోసం పద్మం ముఖం పైకెత్తుతుంది. వంచుకోదు. వాళ్ళు నీతో మాట్లాడటం లేదు. అందుకే నీకేమీ వినిపించటంలేదు. ప్రజల గొంతులు విడి విడిగా బలహీనమైనవి కావచ్చు. కాని అందరూ కలిసి గర్జించినప్పుడు నీకు వినిపించి తీరుతుంది. వెళ్ళు! నీ వంటి ఉన్నతుడు తమ మధ్య ఉన్నట్టు కూడా ప్రజలకు తెలీదు."

పొట్టివాడు చలిజ్వరం వచ్చినట్టు వొణికాడు. డాక్టరుకేసి ఒక క్షణం కంగారుగా చూసి బయటికి పారిపోయాడు. అతను వెళ్ళిన వాకిలిగుండా మరో మనిషి జంకుతూ వచ్చాడు.

## 4

"దయచెయ్యండి. మీకేం కావాలి?" అన్నాడు డాక్టరు.

ఈ మనిషి 'చాలా పేదవాడు'గా ఉన్నాడు.

"యుద్ధజ్వరానికి తమరు సముచిత చికిత్స చేస్తారట?"

"అవును, కూర్చోండి. మీకేనా యుద్ధ జ్వరం?"

"చిత్తం."

"ఎన్నాళ్ళనుంచీ? ఎట్లా ప్రారంభమయింది?"

"బాబూ కిందటి యుద్ధం వచ్చిందాకా నేను పడ్డ కష్టాలు ఇన్నీ అన్నీ కావు. బేడ[1]తో కడుపునిండే ఆ కాటకం[2]లో నా దగ్గిర అర్ధణా[3] డబ్బులు లేక పోయాయి. పిల్లలు గలవాణ్ణి. నా భార్యా పిల్లలూ వరదల్లో కొట్టుకుపోయినట్టూ, నేను ఒంటరిగాణ్ణి అయిపోయినట్టూ సుఖమైన కలలు కనేవాణ్ణి. తెల్లారి లేవగానే అందరూ పులులల్లే బతికి కనిపించేవారు. నా పాలిటి దేవతల్లే యుద్ధం వచ్చింది. నాకింత బతుకుతెరువు దొరికింది. అయిదారేళ్ళపాటు అందరం తిండి తిన్నాం. నా పిల్లలు చదువుకున్నారు కూడా. వాళ్ళకి నేను బట్టలు కొనిపెట్టాను. అదంతా కల. కల కరిగిపోయింది. మళ్ళీ నిరుద్యోగం నన్నాకట్టుకుంది. నాతోటివాళ్ళంతా 'శాంతి శాంతి' అని అరుస్తున్నారు. పైకి అనటానికి ధైర్యం లేదు. యుద్ధం రావాలని రోజూ దేవుడికి దణ్ణం పెడుతున్నా బాబూ! అది రాకుండా వుంది. యుద్ధంకోసం దహించుకుపోతున్నాను. నాకేదన్నా మార్గం చూపండి."

"నువ్వయితే ఏం చెబుతావు?" అన్నట్టు డాక్టరు నాకేసి చూశారు. నేను యుద్ధజ్వరితుడికేసి చూశాను.

"అట్లా కూచో!"

రోగి ఒక కుర్చీలో కూర్చున్నాడు.

"నీకు నీ భార్యమీదా, పిల్లలమీదా ఏమీ ఆపేక్షలేదు, అవునా?"

"అవును, బాబూ!" అన్నాడు రోగి.

"నువు యుద్ధం ఎవరికోసం కోరుతున్నావు?"

"వాళ్ళకోసమే, బాబూ."

"నీకు వాళ్ళంటే ఇష్టంలేదుగా?"

"బరువుగదా, బాబూ?"

"మాటవరసకి యుద్ధంవచ్చి నువ్వందులో చస్తావనుకో."

"నాభారం తీరిపోతుంది, బాబూ."

"అయితే పిల్లలబరువు లేని సమాజంకోసం పోట్లాడు."

"ఆ కమ్యూనిస్టు లన్నమాటే తమరూ అంటున్నారా, బాబూ?"

"నేను చెప్పినట్టు చెయ్యటానికి నీకేమి అభ్యంతరం?"

"నన్ను పోలీసులు చంపేస్తే?"

"యుద్ధంలో చావటానికి నువు సిద్ధమేగా?"

---

1. దశాంశ పద్ధతి అమలులోకి రాకముందు ఇవి వుండేవి. 8 బేడలు = 1 రూపాయి; 16 అణాలు = 1 రూపాయి.
2. ఆర్థిక కాటకం రోజులు.
3. అణాలో అర్ధభాగం = రూపాయిలో 32వ వంతు.

"అదేంమాట, బాబూ? యుద్ధంలో చేరితే బతికినన్నాళ్ళూ సుఖంగా బత కొచ్చునే. చస్తామని మాత్రం ఎక్కడుంది."

"అయితే నీ భార్యాబిడ్డలను సంఘానికి విడిచి నువు ఎక్కడైనా పారిపో. నీ పొట్టతిప్పలు నువు చూసుకో."

రోగి అనుమానిస్తూ, "మరి వాళ్ళేమవుతారు, బాబూ?" అన్నాడు.

"ఏమయినా బాంబులుపడి తునకలు కారు. చేతులూ, కాళ్ళూ విరిగి వికలాంగులు కారు."

"కాస్త మంచి సలహా ఏదన్నా చెప్పండి, బాబయ్యా!"

"పోయి నీ భార్యాబిడ్డలను ప్రేమించటం నేర్చుకో, నీ యుద్ధజ్వరం అదే పోతుంది. నిన్ను చూసి నువే జాలిపడకు, వెళ్ళు."

"డాక్టరుగారూ, మా వారిమాట ఏం చెప్పారు?" అన్నది మొదట వచ్చిన స్త్రీ.

నేనావిడమాటా, ఆవిడ భర్తమాట పూర్తిగా మరిచాను.

"మీకున్నదల్లా ధర్మంచేసి మీ భర్త ఎక్కడన్నా ఉద్యోగం సంపాదిస్తే ఆయన కళ్ళ మసక పోతుంది" అన్నాడు ధన్వంతరిగారు.

ఇంతవరకూ దూరంగా కుర్చీలోనే కూర్చుని ఉండిన మనిషి చివాలున లేచి, నీకేమన్నా చాదస్తమా ఏం? పద పోదాం" అంటూ గదినుంచి బయటికి నడిచాడు. స్త్రీ మాకేసి అనుమానంగా చూస్తూ నిష్క్రమించింది.

ఇదే సమయంలో పోస్టుమనిషి ఒక ఉత్తరం తెచ్చి ధన్వంతరిగారికిచ్చాడు.

## 5

డాక్టరుగారు ఉత్తరంలో నిమగ్నులై ఉండటం చూసి నేను లేచాను.

ఆయన నన్ను కూర్చోమని సంజ్ఞచేస్తూ ఉత్తరం పైకి చదివారు.

"శ్రీ డాక్టర్ ధన్వంతరిగారికి తమ విధేయుడు ఫలానా ఫలానా వ్రాయునది! నేను సర్వజ్ఞత్వముతో బాధపడుతున్నాను. ఈ వ్యాధికి చికిత్స ఉన్న పక్షమున పోస్టు ద్వారా తెలుపగోరుతాను. నాకు గల రోగ లక్షణములివి!

"నేను చదువుకున్న వాణ్ణి కాను. కొంచెం పిత్రార్జితం ఉంది. నాకు మైనారిటీ వెళ్ళగానే మా నాయనతో భాగాలు పడి నా వంతు తెగనమ్మి మరొకరితో కలిసి సినిమాహాలు కట్టించాను. నా భాగస్వామి వ్యసనపరుడు కావటం నాకు లాభించింది. అయదు సంవత్సరాలు సినిమాహాలు నడిపిన తరువాత అతను చనిపోయేనాటికి అతని వాటా మొత్తానికి సరిపడా నాకు బాకీ తేలినట్టు సులభంగా లెక్కలు చూపగలిగాను. హాలు పూర్తిగా నాదయింది. కొద్దికాలానికి నేను పోగు చేసిన డబ్బుతో ఒక పిక్చరుకు డిస్ట్రిబ్యూషను తీసుకోగలిగాను. అదృష్టవశాత్తూ

ఈ పిక్చరు నాకు డబ్బుచేసి పెట్టింది. తరువాత డిస్ట్రిబ్యూషనులో దిగి కొన్ని కొన్ని షరతులద్వారా నా సొమ్ముకు ప్రమాదం లేకుండా చూసుకుంటూ దెబ్బ తిన్న పిక్చర్లమీదకూడా లాభాలు తీస్తూ జయప్రదంగా చాలా ఏళ్ళనుండి వ్యాపారం చెయ్యగలుగుతున్నాను.

"కొద్దికాలంగా నన్ను సర్వజ్ఞత్వం బాధిస్తున్నది. అనేక విద్యలలో పేరు సంపాదించినవారూ, అనుభవం ఉన్నవారు కూడా తమకు తెలిసిన విద్యలను గురించి మాట్లాడుతుంటే నాచెవులకు చెత్తలాగా వినిపిస్తుంది. సంగీతం గురించి అయేది సాహిత్యం గురించి అయేది, రత్నాలను గురించి అయేది, రాజకీయాలను గురించి అయేది, నాటకాలను గురించి అయేది, నటన గురించి అయేది, ఆఖరుకు రసాయనిక శాస్త్రం గురించి అయినాసరే నాకు తట్టిన అభిప్రాయాలకు ఎవరన్నా ఎదురు చెబితే వాళ్ళు పురుగుల్లాగా నా కంటికి కనిపిస్తారు. ఈ వ్యాధి నన్నింత కాలంగా బాధపెట్టలేదు. అందుచేత నేను దాన్ని గురించి ఆటే బాధపడలేదు. కాని ఈయేడు మనం పట్టిన నాలుగు పిక్చర్లూ భస్మీపటలమయిపోయాయి. ఎన్నడూలేనిది మనకీయేడు చేతిది బాగా తగిలింది. ముందు రోజులు బాగాలేవు. కాని ఈ సర్వజ్ఞత్వం నన్ను ఊబిలోనుంచి బయటికి రానివ్వకుండా వుంది. నాకు ఈయేడు చిత్రాలిచ్చిన వారంతా నా శాసనాలకు కట్టుబడి పిక్చర్లు తీయబట్టే మట్టి కరిచారు. ప్రొడ్యూసర్లు నన్ను ఊడ్చిపారెయ్యకమునుపే నాకీ వ్యాధి నివారణ అయితే నేను బాగుపడే అవకాశంవుంది. కనుక తమరు నాయందు దయవుంచి నాకీ సర్వజ్ఞత్వ వ్యాధి తొలగిపోయే మార్గం చూపితే నేను తమరు కోరిన కట్నం ఇచ్చుకుంటాను."

ఉత్తరం చదివేసి డాక్టరుగారు దాన్ని ముక్కలు ముక్కలు చేసి తుక్కులో పారేశారు.

"ఏం, పాపం, సమాధానం యివ్వకపోయూరా!" అన్నాను.

"వ్యాధి తిరుగుముఖం పట్టింది. చికిత్స అనవసరం," అన్నాడాయన.

నేను డాక్టరుగారి దగ్గర సెలవు పుచ్చుకుంటూ, "ఇక్కడ ఒక అర గంటయినా గడిపానో లేదో చాలా విచిత్రమైన విషయాలు తెలిశాయి. వెళ్ళి వస్తాను. నాకు సెలవిప్పించండి," అన్నాను.

"మంచిది వెళ్ళిరండి." అన్నాడు డాక్టరుగారు.

## 6

ఆరోజు సాయంకాలం నాకు మా స్నేహితుడొకడు కనిపిస్తే అతనితో డాక్టరు ధన్వంతరిగారి వింత ఆస్పత్రి గురించి చెప్పబోయాను.

"అదా? దాన్ని ఇవాళ మధ్యాహ్నం పోలీసులు మూసేశారు. ఇంకా స్వేపటికి పత్రికల్లో వార్తకూడా వస్తుంది," అన్నాడు నా మిత్రుడు.

"నీ కెట్లా తెలుసు?" అన్నాను.

"నేనీ ఉదయం మన మంత్రిగారింటికి వెళ్ళా. నిన్న సాయంకాలమే కాబినెట్‌లో ఈ ఆస్పత్రి గురించి చర్చించారట. ఈ ధన్వంతరి రష్యా ఏజెంట్టై ఉంటాడన్న అనుమానం గట్టిగా మంత్రులందరికీ కలిగింది. ఇతనికి వైద్యం అవలంబించే లైసెన్సు లేదన్న మిషమీద ఆస్పత్రి మూయించాలని ఒక మంత్రి సూచించాడు. అయితే చికిత్సలు మామూలు రోగాలకు కావు గనుక లైసెన్సు అవసరమో లేదో, రాజ్యాంగం అతనికి అనుకూలంగా ఉంటుందేమో అని కొందరు మంత్రులు సంకోచించారు. చివరకు మూయించటమే మంచిదనీ, అంతగా అయితే అతను సుప్రీంకోర్టుకు వెళ్ళి గెలిచినప్పుడు చూసుకోవచ్చుననీ నిర్ణయానికి వచ్చారు," అన్నాడు నా మిత్రుడు.

నేనేమీ మాట్లాడలేదు.

[ప్రథమ ముద్రణ : ఆగష్టు 1953, ఆంధ్రజ్యోతి మాసపత్రిక]